క్లుప్తంగా...

'రవ్వా శ్రీహరి సేవలు మరువలేనివి'

నాంపల్లి: ఆధునిక తెలుగు నిఘంటుకర్త, సంస్కృత పండితులు ఆచార్య రవ్వా శ్రీహరి మరణం పట్ల తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు ఓ ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. పరిశోధన, సృజన, విమర్శ, అనువాదం, వ్యాకరణం, నిఘంటు నిర్మాణ రంగాల్లో శ్రీహరి చేసిన కృషి అనిర్వచనీయమని, తెలుగు విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి ఉపాధ్యక్షుడిగా పనిచేశారని, వర్సిటీకి వారు చేసిన సేవలను విశ్వవిద్యాలయం మరువలేదని తెలిపారు. రవ్వా శ్రీహరి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.

సారస్వత పరిషత్ ప్రగాఢ సానుభూతి

సుల్తాన్‌బజార్: ప్రముఖ సాంస్కృతిక విద్వాంసులు ఆచార్య రవ్వా శ్రీహరి మృతికి తెలంగాణ సారస్వత పరిషత్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో స్నాతకోత్తర విద్య పూర్తి చేసిన శ్రీహరి పరిషత్ ప్రాశ్చ్య కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందించడంతో పాటు దీర్ఘకాలం పరిషత్ ప్రధాన కార్యదర్శిగా విశిష్ట సేవలందించారని పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ చెన్నయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి తెలుగు సాంస్కృతిక వాఙ్మయానికి తీరని లోటు అని వారు సానుభూతి వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గోల్కొండ: 20 ఏళ్ల క్రితం ఒక దగ్గర చదువుకున్న విద్యార్థులు మళ్లీ కలుసుకున్నారు. గుడిమల్కాపూర్‌లోని సెయింట్ మేరీస్ 1999 బ్యాచ్ విద్యార్థులు శనివారం మళ్లీ కలుసుకున్నారు. ఈ సమ్మేళనంతో తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఆహ్వానించారు. వారితో తమ అనుబంధాన్ని ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అంబటి కృష్ణ, మధు, దివ్య, వినోద్, బాలరాజ్ తదితరులున్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకుల సహకారంతో ధరిత్రి దినోత్సవం ప్రాముఖ్యత గురించి ఎల్‌ఈడీ డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీకి చెందిన ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి తాము కళాశాల పరిసరాల్లో ఉన్న పాఠశాలలు, కాలనీ సంక్షేమ సంఘాలతో పాటు విద్యార్థులను కూడా ఆహ్వానించామన్నారు. దీనివల్ల ధరిత్రి పరిరక్షణకు తామిచ్చే సందేశం ప్రతిఒక్కరికీ చేరుతుందని ఆయన అన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాసాచార్యులకు ఉత్తమ అర్చకుల అవార్డు ప్రదానం



నల్లదీగల శ్రీనివాసాచార్యులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ నల్లదీగల శ్రీనివాసాచార్యులకు ఉత్తమ అర్చకుల అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేశారు. రుద్రా స్టూడియో ఆధ్వర్యంలో సత్యసాయి నిగమాగమల్లో శ్రీనివాసాచార్యులకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ... వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తన సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరింతగా సేవలందిస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులకు చైర్మన్ కె.యుగేందర్ రెడ్డి, ఈవో కె.జయంతి, పాలక మండలి సభ్యులు ప్రత్యేక అభినందించారు.

పుస్తకావిష్కరణ

రాజేంద్రనగర్: కవి, రచయిత మన్నె మహాత్మారావు రచించిన రుద్ర నమక చమక భువన తారక పరమార్థం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. భవానీ కాలనీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోకరి అర్జున్‌గౌడ్, సాహితీరత్న వేము వందనంలు హాజరయ్యారు. సత్యనారాయణరెడ్డి, ఆంజనేయులు, నీలకంఠం, అశోక్ కుమార్, శ్రీరాములు, కృష్ణ, ఉమారెడ్డి, ఈశ్వర్, సతీష్, రామారావు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మైనార్టీ కమిషన్ డైరెక్టర్ హరిషద్ అలీఖాన్



హోంమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా, సంతోష్‌గుప్తా



ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ రవియాదవ్

భక్తిశ్రద్ధలతో రంజాన్



రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శనివారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్ పండుగ) వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఉదయం మక్కా మసీదుతో పాటు తమ తమ ప్రాంతాల్లోని మసీదులలో సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. హిందువులు సైతం తమ తమ ప్రాంతాల్లోని ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలియజేసి మత సామరస్యాన్ని చాటి చెప్పారు. మక్కా మసీదుతో పాటు ఆయా ప్రాంతాల్లోని మసీదుల వద్ద ముస్లింలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. – చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గాలో మాట్లాడుతున్న హజ్రత్ ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి



మక్కా మసీదులో ఈద్ ముబారక్ తెలియజేసుకుంటున్న ముస్లింలు



టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విక్రమ్‌కుమార్



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానించిన ఎం.రేణుకా, ఎ.శ్రీశైలం యాదవ్



మైనార్టీలను సన్మానించిన జియాగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి తదితరులు

మే 9న త్రయోదశి ఆలయంలో భజన పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

నాంపల్లి: నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వహణలో మే 9న హయత్‌నగర్‌లోని ఆటోనగర్ ద్వారకానగర్ కాలనీ త్రయోదశి ఆలయంలో భజన పోటీలు–2023 పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నక్క శ్రీనివాస్‌యాదవ్, బడేసాబ్ వెల్లడించారు. ఈ మేరకు భజన పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మాసబ్‌ట్యాంక్‌లోని నఫీస్ రెసిడెన్సీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి ఆవిష్కరించారు. నక్కా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో పాల్గొనదలచిన భజన బృందాలు మే 3వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99482 41188, 91606 07662లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పరశురామ్ జయంతి



పూజలు చేస్తున్న నవరతన్ ఇందోరియా

జియాగూడ: కార్వాన్‌లో గల ప్రాచీన్ గణేష్ మందిరంలో గల శ్రీ పరశురామ్ ఆలయంలో పరశురాముని జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ పరశురామ్ సేవా మండల్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు నవరతన్ ఇందోరియా హాజరై పరశురాముని మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ హారతి, ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బాలాజీ, గిరీష్, వీరేందర్ సింగ్, ఆనంద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే లక్ష్యం



బంగారు ఆభరణాలతో సినీనటి సుభాశ్రీరాయ్

గన్‌ఫౌండ్రీ: వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని బి.గోకుల్ చంద్ జ్యువెలర్స్ యజమాని చేతన్‌కుమార్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లోని గోకుల్‌చంద్ జ్యువెలర్స్ సరికొత్త షోరూమ్‌ను సినీనటి సుభాశ్రీ రాయ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యువెలర్స్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో పలువురు మోడళ్లు సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఎంతో ఇష్టమైన చెవిపోగులు, ఉంగరాలతో సహా వివిధ రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని రోటరీ క్లబ్, ఐసీఏఆర్ (చిరుధాన్యాల పరిశోధన సంస్థ),ఐఐఎం ,శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు ఉన్న 15 మందిని గుర్తించి ఈ నెల 30న శంకర్ కంటి వైద్యశాలలో ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ సత్యవతమ్మ, వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ పరిశోధన సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలు, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయంతోనే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని నానక్‌రాం గూడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ పబ్లిక్ గ్రీవెన్స్ డిస్పోజల్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, అధికారులతో ముఖాముఖి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు నోట్ చేసుకుంటూ వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్, జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఎల్ఓ కృష్ణ, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది కిష్టయ్య, శ్రీనివాస్, సుమన్, మహేందర్ నాయకులు కై లాష్‌సింగ్, ముత్యంరెడ్డి, శివసింగ్, యాదగిరి, మల్లేష్, అరుణ్‌గౌడ్, గోపాల్, కవిత, మహేందర్, సత్యనారాయణసింగ్ పాల్గొన్నారు.

నిషేధిత యాప్‌లో క్రికెట్ బెట్టింగులు

యువకుడి అరెస్ట్: రూ 38 వేల స్వాధీనం



నిందితుడు రాము

బంజారాహిల్స్: నిషేధిత గోల్డ్ 365 యాప్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీలో నివసించే రాపనోలూరు రాము(26) గచ్చిబౌలిలోని ది స్పైస్ కిచెన్‌కు మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీన రాత్రి ఫిలింనగర్‌లోని కేఫ్ మిలాంజ్‌లో కూర్చొని డిన్నర్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయన ఫోన్‌ను పరిశీలించి గోల్డ్ 365 యాప్‌లో బెట్టింగ్ కాస్తున్నావంటూ అరెస్ట్ చేసి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి రామును అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించగా శనివారం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా అదే రోజు మరికొంత మంది యాప్‌లను కూడా పోలీసులు పరిశీలించినట్లు తెలిసింది. వారం రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. వీరందరూ నిషేధిత గోల్డ్ 365 యాప్‌ను వినియోగిస్తున్నారని దీని ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారంటూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరోపిస్తున్నారు. తాజాగా అరెస్ట్ చేసిన నిందితుడు రాము నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ. 38 వేలు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ఈనెల 25న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. శనివారం బేగంబజార్ తారా ఇంటర్నేషనల్ హోటల్‌లో జరిగిన గోషామహల్ నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 8 వేల మందితో గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని డివిజన్లల్లో అందరూ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, నగర బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని నందకిశోర్ వ్యాస్ బిలాల్ తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఆత్మీయ సమ్మేళనం ప్రారంభిస్తామని వివరించారు. ఈ సమావేశంలో గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఆర్‌వీ.మహేందర్, శీలం సరస్వతి, పూజవ్యాస్ బిలాల్, శశిరాజ్ సింగ్, ఆనంద్‌సింగ్, యాదగిరి, వనిత, అనిత, పప్పుమాత్రే, ప్రియాగుప్తా పాల్గొన్నారు.

ముగిసిన రంజాన్ మార్కెట్

చార్మినార్: పాతబస్తీలో నెల రోజుల పాటు కొనసాగిన రంజాన్ మార్కెట్ ముగిసింది. శనివారం రంజాన్ పండగ కావడంతో రంజాన్ మార్కెట్ కొనసాగిన ప్రధాన రోడ్లు బోసిపోయి ఖాళీగా కనిపించాయి. మదీనా నుంచి మక్కా మసీదు వరకు గల ప్రధాన రోడ్డులో నెల రోజులుగా రంజాన్ మార్కెట్ కొనసాగింది. ప్రతిరోజూ ప్రజలు తమకు అవసరమైన వస్తువులను ఖరీదు చేయడానికి నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పాతబస్తీకి రావడంతో చార్మినార్ పరిసరాలు రంజాన్ మార్కెట్‌తో కిటకిటలాడాయి. నెల రోజుల పాటు కొనసాగిన రంజాన్ మార్కెట్ ఈద్–ఉల్–ఫితర్ పండగతో ముగిసింది.



బోసిపోయి ఖాళీగా కనిపిస్తున్న చార్‌కమాన్–చార్మినార్ రోడ్డు

అభినందనలు



చక్రాధర్‌ను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మరావుగౌడ్

అబిడ్స్: ఈనెల 28వ తేదీ నుంచి పంజాబ్ మొహాలీలో జరగబోయే జాతీయ స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు నగర విద్యార్థి కాసుల చక్రాధర్ ఎంపికయ్యాడు. 28 నుంచి 2వ తేదీ వరకు జాతీయ స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయి. డీపీఎస్‌లో 9వ తరగతి చదువుతున్న చక్రాధర్‌ను శనివారం డిప్యూటీ స్పీకర్ పద్మరావుగౌడ్ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. చక్రాధర్ మాట్లాడుతూ.. తన తండ్రి ఇన్‌స్పెక్టర్ మారుతీప్రసాద్, కోచ్‌ల సహకారంతో 2023 స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు

రాజేంద్రనగర్: హైదర్‌గూడ ఎర్రబోడలో బీరప్ప స్వామి జాతరలో భాగంగా శనివారం హోమం, బీరప్ప గుడి మైలలు, గంగతెప్ప తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం దేవాలయ ఆవరణలో చేసిన హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదివారం బీరప్పస్వామి కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. హైదర్‌గూడ పరిసర ప్రాంతాలకు చెందిన కురుమ కులస్తులు సాయంత్రం సామూహిక బోనాలతో దేవాలయానికి రానున్నారు. ఐదు సంవత్సరాల అనంతరం ఈ పండుగను చేపడుతున్నారు.



హోమం చేస్తున్న భక్తులు

భారతీయ సంస్కృతిని పరిరక్షించుకోవాలి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పంచమవేద నాట్య నిలయం 21వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ పెంచేలా శిక్షణా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు నాట్య గురువులను, కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బెల్లం మాధవి, కార్పొరేటర్ రావుల శేషగిరి, కూచిపూడి నృత్య గురువులు వేదాంతం రాధేశ్యామ్, ప్రసన్నరాణి, నాట్య నిలయం గురువు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు



మహాత్మా బసవేశ్వర

చార్మినార్: సమాజంలో కుల వ్యవస్థతో పాటు వర్ణ విబేధాలు, లింగ వివక్షను వ్యతిరేకించిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వర జయంత్యుత్సవాలు ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈనెల 23న ఘనంగా జరుగనున్నాయి. నగరంలోని కన్నడీగులు నెల రోజుల పాటు నిర్వహించే జయంత్యుత్సవల్లో భాగంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం కర్ణాటక నుంచి తెలంగాణకు వచ్చిన కన్నడీగులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఇక్కడి ప్రజలతో కలిసి సహజీవనం చేస్తున్నారు. తమ ఆరాధ్య దైవం.. గొప్ప మానవతావాది అయిన మహాత్మా బసవేశ్వర జయంత్యుత్సవాలను పురస్కరించుకొని పేదలకు అన్నదానం , రోగులకు పండ్ల పంపిణీ, పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ తదితర సామాజిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



నివాళులర్పిస్తున్న టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి తదితరులు

అణగారిన జాతుల అభివృద్ధి కోసం..

అణగారిన జాతుల అభివృద్ధి కోసం బసవేశ్వరుడు చేసిన సేవలు ఎనలేనివి. చిన్ననాటి నుంచే సామాజిక సేవా కార్యక్రమాల చురుకుగా పాల్గొనే వారు. కర్ణాటకలోని బాగేవాడిలో మాదిరాజు, మాదలాంబికల దంపతులకు బసవేశ్వరుడు జన్మించారు. వేద పండితుల కుటుంబంలో జన్మించిన ఆయన చాళుక్యుల సామ్రాజ్యం పాలనలో కల్యాణం రాజధాని ప్రధాన మంత్రిగా పనిచేశారు. అంటరాని తనాన్ని గట్టిగా వ్యతిరేకించారు. వీరశైవ ధర్మ ప్రచారం చేసారు. ఇష్టలింగ పూజ.. మహిళలకు సమాన హక్కుల కోసం కృషి చేసిన ఆయన జయంత్యుత్సవాలను ఇక్కడి కన్నడీగులు ఘనంగా నిర్వహించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు..



బసవేశ్వర జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కన్నడ ప్రజల తరఫున ధన్యవాదాలు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మహాత్మా బసవేశ్వరుడు ఎంతగానో కృషి చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలలో ఉన్న విధంగా బసవేశ్వర జయంతి సందర్భంగా ఇక్కడ కూడా సెలవు ప్రకటిస్తే బావుంటుంది.

– నాగ్‌నాథ్ మాశెట్టి, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు